







సంపుటి : 02 సంచిక : 135 ఆదివారం 18-05-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


# మహిళల ఓట్లు మాకే

## మళ్లీ అధికారం మాదే.. కోటి మందిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

### మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్డులు

### బడాబాబులు రుణాలు ఎగ్గొడుతున్నారు

### మహిళలు క్రమశిక్షణతో తిరిగి చెల్లిస్తున్నారు

### సహాయక సంఘాలకు రూ.లక్ష కోట్లు ఇస్తాం

### వి-హబ్ స్టార్టప్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

### డ్రగ్స్ కట్టడిలో రాష్ట్రానికి అవార్డుపై సీఎం హర్షం



హైదరాబాద్, మే 17

గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మంది మహిళలు కాంగ్రెసకు ఓటేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కోటి మంది ఆడపడచులు తమకే ఓటేస్తారని, వారి ఓట్లతో రెండోసారీ కాంగ్రెస్సే అధికారంలోకి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన విమెన్ ఆంత్రప్రెన్యూర్స్ హబ్ (వి-హబ్) రాష్ట్ర స్థాయి స్టార్టప్ సదస్సు శనివారం హైదరాబాద్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. వ్యాపార ఆలోచనలున్న మహిళలను ప్రోత్సహించే 'విమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం', కళాశాలల్లో యువతుల కోసం 'గ్రాస్ రూట్ యూత్ ఇన్నొవేషన్ ప్రోగ్రాం'లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఇందిరాగాంధీ నేతృత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించింది. సోనియాగాంధీ నేతృత్వంలో రెండుసార్లు యూపీఏ ప్రభుత్వం ఆర్టీఐ, ఆర్టీఏ, ఆహార భద్రత, ఉపాధి హామీ వంటి చరిత్రాత్మక పథకాలను ప్రారంభించింది. ఇందిర, సోనియా నేతృత్వంలో దేశం మహిళా సాధికారిత వైపు పరుగులు పెట్టింది. అందుకే రాష్ట్రంలోని మహిళలంతా కాంగ్రెసకే మద్ద తు పలుకుతున్నారు. వారి ఆశయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది" అని అన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం ఆరోగ్య భద్రత కల్పిస్తుందని సీఎం చెప్పారు. వారికి యునిక్ నంబర్ గానీ, క్యూఆర్ కోడ్ గానీ ఉండే గుర్తింపు కార్డును జారీ చేసే విధానాన్ని అమల్లోకి తేవాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను ఆదేశించారు. ఆరోగ్య, ఆర్థికపరమైన వివరాలతో కూడిన డేటా బేస్ తయారు చేసి అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, ప్రతి ఆరోగ్య పరీక్ష వివరాలను అందులో పొందుపరచాలన్నారు. తెలంగాణ 'ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ'ను సాధించాలంటే రాష్ట్రంలో కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలని, ఆ లక్ష్య సాధనలో భాగంగానే ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా ఒక్కో మహిళ నెలకు దాదాపు రూ.5వేల మేరకు ఆదా చేస్తున్నారని, ఆర్టీసీ కూడా లాభాల బాట పట్టిందని చెప్పారు. "ఆర్టీసీ ద్వారా నడుపుకోవడానికి మహిళా గ్రూపులకు ఇప్పటికే 150 బస్సులను కేటాయించాం. త్వరలో మరో 600 బస్సులను అందించనున్నాం. అవసరమైతే భవిష్యత్తులో మరిన్ని కేటాయిస్తాం. పెద్ద కార్పొరేట్ సంస్థలే నిర్వహించే వ్యాపారాల్లో సైతం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నాం. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి మహిళా సంఘాలను ప్రోత్సహించి రాష్ట్ర విద్యుత్ శాఖ ద్వారా ఒప్పందాలు చేస్తున్నాం. హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో మహిళా సంఘాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే సౌలభ్యం కల్పించాం. ఇలా మహిళలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం" అని సీఎం రేవంత్ వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి రూ.17 లక్షల కోట్ల రుణాలను పలు కార్పొరేట్ సంస్థలు ఎగవేశాయని సీఎం తెలిపారు. వారికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించిందని ఆరోపించారు. బడాబాబులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు ఎగ్గొడుతుంటే.. రాష్ట్రంలోని మహిళా సంఘాలు ఎంతో క్రమశిక్షణతో రుణాలను తిరిగి చెల్లిస్తున్నారని ప్రశంసించారు. గతేడాది రూ.20 వేల కోట్ల మేరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇస్తే.. ఒక్క రూపాయి ఎగవేయకుండా తిరిగి చెల్లించారని తెలిపారు. మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు బలంగా ఉన్నాయని, పట్టణ ప్రాంతాల్లో పెద్దఎత్తున సభ్యులను ఈ సంఘాల్లో చేర్పించా లన్నారు. వి-హబ్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నామని, వరంగల్, హన్మకొండ, పెద్దపల్లి, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల్లో వి-హబ్ 'విమెన్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'లను ఏర్పాటు చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఇతర జిల్లాల్లోనూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి సంజ య్ కుమార్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, పరిశ్రమల శాఖ సంచాలకులు గుర్రం మల్సూర్, వి-హబ్ సీఈవో సీత పల్లచోళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌తోపాటు 17సంస్థలతో వి-హబ్ ఒప్పందం కుదుర్చుకుంది.

# ఉద్యోగులను ఇబ్బంది పెడితే ఊరుకోం


### ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని బీఆర్ఎస్ నిర్ణయం

### ఉద్యోగ సంఘాల నేతలతో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ



**హైదరాబాద్, మే 17:** లక్షల మంది ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పారు. ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పూర్తిస్థాయి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. హరీశ్‌రావు నివాసంలో ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశం జరిగింది. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చకపోవడం, డీఏ బకాయిలు, పీఆర్సీ వంటి ప్రధాన డిమాండ్లను పట్టించుకోకపోవడం, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను కూడా సకాలంలో అందించకపోవడం వంటి విషయాలను కేటీఆర్, హరీశ్‌రావుల దృష్టికి సంఘ నాయకులు తీసుకొచ్చారు.

# భారత్ పాక్‌లు చర్చించుకోవాలి



న్యూఢిల్లీ, మే 17: సమస్యల పరిష్కారానికి భారత్,పాకిస్థాన్‌లు చర్చలు జరుపుకోవాలని రష్యా సూచించింది. ఇప్పటికే అమెరికా, చైనాలు ఇలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా తాజాగా ఆ జాబితాలో రష్యా చేరింది. సరిహద్దుల్లో మిలటరీ చర్యల నిలుపుదల, కాల్పుల విరమణకు ఈ నెల పదో తేదీన కుదిరిన ఒప్పందం స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపింది. ఘర్షణలు పునరావృతం కాకుండా విభేదాలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని, రాజకీయ అంగీకారానికి రావాలని పేర్కొంది. మాస్కోలో రష్యా విదేశాంగ అధికార ప్రతినిధి మారియా జఖరోవా ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. భారత్-పాక్‌ల మధ్య తలెత్తిన ఘర్షణ, అనంతరం కుదిరిన కాల్పుల ఒప్పందంపై రష్యా వైఖరి ఏమిటంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమె ఈ సమాధానం ఇచ్చారు. రెండు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. చర్చలను పునఃప్రారంభించాలని అన్నారు

### చురుగ్గా 'నైరుతి'..

# నేడు, రేపు మోస్తరు వానలు

### రాష్ట్రంలో వడదెబ్బకు ఇద్దరు..

### పిడుగుపాటుకు మరో ఇద్దరి మృతి



హైదరాబాద్, మే 17

పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా కదులుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ తెలంగాణ, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలాచోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. మూడు రోజుల పాటు ఎండలు తక్కువే ఉంటాయని.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశముందని వివరించింది. కాగా, రాష్ట్రంలో వడదెబ్బకు ఇద్దరు.. పిడుగుపాటుకు మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రెండు, మూడు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాల ప్రభావంతో ఎండల తీవ్రత కాస్త తగ్గింది. శనివారం పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో అత్యధికంగా 41.7 డిగ్రీలు నమోదైంది. నల్లగొండ జిల్లా డిండి మండలం సింగరాజుపల్లిలో పంచాయతీ పారిశుధ్య కార్మికుడు పొనుగోటి రామేశ్వర్‌రావు (60), ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రామచంద్రపురంలో తొర్లపాటి దాసు (80) వడదెబ్బకు అస్వస్థత చెంది మృతి చెందారు. కాగా, మంచిర్యాల జిల్లా నెన్నెలలో అత్యధికంగా 6.9, నిజామాబాద్ జిల్లా బాల్కొండలో 5.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# మా కాంగ్రెస్‌కు అదే గతి పడుతుంది..

- ఇంజనీర్ ను శిక్షించి చేతులు దులువు కుంటే సరిపోదు ఆదేశాల మాటున దోపిడీ కొనసాగించిన కెసిఆర్ ను శిక్షించాలి
- కాళేశ్వరం, గత పాలకుల అవినీతి ని కాంగ్రెస్ పార్టీ బయట పెట్టకుంటే కెసిఆర్ జాతిపిత అనే బ్రాండ్ ఇమేజ్ ను ప్రజలు నమ్ముతారు
- రిపోర్టులు కమిషన్స్ వేసి కూర్చుంటే, దోషులను శిక్షించకుంటే గత బిఆర్ ఎస్ కు పట్టిన గతే మా కాంగ్రెస్‌కు పడుతుంది.
- మాజీ ఎంపీ, ఏఐసీసీ ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కి గౌడ్

4 లో..



ఎడిటర్
వి. అయోధ్య రామయ్య
వాస్తవమే గమ్యం!గమనం!!
ఎడిటరియల్

"తెలంగాణా సమకాలీన సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులు, వాటితో పాటు గత పదిఏళ్ళ బిఆర్ఎస్ ప్రత్యేక రాష్ట్ర పాలన మరియు వైఫల్యాలు, అధికారం ముసుగులో వ్యవస్థీకృత నేరాలే కాకుండా మితి మీరిన ప్రభుత్వ ఉమ్మడి ఆస్తుల దోపిడీలో స్వయానా మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ దోషిగా నిలబడ్డాడు, కనుక కనుక అతని ఆర్థికదోపిడీ, ముక్యంగా కాలేశ్వరం ప్రాజెక్టు లో లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ, వాటి పై రిపోర్టులు కమిషన్స్ వేసి కూర్చుంటే సరిపోదు, బట్ట బయలు చేసి దోషికి శిక్ష పడేలా కాంగ్రెస్ పార్టీ కనుక చేయకుంటే ప్రజల్లో గత బిఆర్ ఎస్ కు పట్టిన గతి మళ్ళీ కాంగ్రెస్ కు పడుతుంది అని కాంగ్రెస్ మాజీ ఎంపీ, ఏఐసీసీ ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కి గౌడ్ కుండ బద్దలు కొట్టారు.ఆయన మాటలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించాయి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి మరియు ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి కి మరింత బాధ్యతను గుర్తుచేసాయి, సమైక్యాంధ్రలో ముఖ్యమంత్రిని కావడం అసాధ్యం అని తెలిసిన కెసిఆర్, తెలంగాణా ఉద్యమంలో జొర్రి సీఎం అయ్యాక మొత్తం తెలంగాణ సంపదను వ్యూహాత్మకంగా దోచుకున్నారు, కనుక అమరవీరుల ఆకాంక్షలకు నీళ్లు వదిలారు, నిరుద్యోగం, ఆకలి, దారిద్రం అలాగే ఉండడానికి కారణం అయ్యారు, విద్యా వైద్యం అందక జనం అల్లాడుతు న్నారు. దోచిన డబ్బులు ప్రజలకు పెడితే తెలంగాణ సస్య శ్యామలం అయ్యేది.అని సభలో మాట్లాడారు"

# కాళేశ్వర క్షేత్రం.. భక్తజన సందోహం

### సరస్వతీ పుష్కరాలకు పోటెత్తుతున్న భక్తులు...

### మూడో రోజు లక్ష మందికిపైగా భక్తుల రాక

### అర్ధరాత్రి వర్షంతో ఏర్పాట్లు అతలాకుతలం

**భూపాలపల్లి, మే 17:** సరస్వతీ పుష్కర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర క్షేత్రం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. పుష్కరాల మూడోరోజైన శనివారం లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రహదారులు బురదమయంగా మారినా, ఏడు కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించినా.. భక్తులు కాలినడకన పుష్కర ఘాట్లకు చేరుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి, సరస్వతీ మాతను, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. వారాంతపు సెలవులు కావడంతో విద్యార్థులు మహిళలు, ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ట్రాఫిక్ స్తంభించినప్పటికీ భక్తులు లెక్కచేయకుండా కాళేశ్వరానికి తరలిరావడం గమనార్హం. ముఖ్యంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నుంచిభక్తులు పెద్దసంఖ్యలో తరలిరాగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీసగఢ్ రాష్ట్రాల నుంచీ భారీ సంఖ్యలో వచ్చారు. భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరగడంతో అధికారులు రద్దీని నియంత్రించలేని పరిస్థితిని ఎదుర్కొన్నారు. అధికారులు.. వీఐపీల దర్శనాలకు ప్రాధాన్యమిచ్చి సామాన్యులను విస్మరించడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, ఠాకూర్ మక్కాన్‌సింగ్ తదితరులు శనివారం పుష్కర స్నానం చేసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అంతకుముందు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఆయన సోదరుడు ప్రసాద్.. వారి పితృదేవతలకు పిండ ప్రదానం చేసి గోదావరిలో తర్పణం వదిలారు. అలాగే ముక్తీశ్వరాలయంలో భట్టి కుటుంబ సభ్యులు కాలసర్పదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కాళేశ్వరాలయంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# ప్రపంచ రక్త పోటు దినోత్సవం

## డాక్టర్ రమేష్ అవగాహన సదస్సు



**తొలి సమయం తొర్రూరు మే 17**

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మే నెల 17వ తేదీ 2025 నప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో రక్తపోటు గురించి అవగాహన మరియు జీవనశైలిలో వస్తున్న మార్పులపై కార్యక్రమాన్ని ఉన్నత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొర్రూరు నందు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన థీమ్ నేపథ్యంలో గురించి మాట్లాడుతూ మీ రక్తపోటును కచ్చితంగా కొలవండి, నియంత్రించండి , ఎక్కువ కాలం జీవించండి , అని తెలియజేయడం జరిగింది. మరియు హైపర్ టెన్షన్ కి దారి తీసే ప్రమాద కారకాలు వచ్చే క్లిష్టతను రక్తపోటును క్రమం తప్పకుండా తనిఖీ చేయడం మరియు మందులను సరైన రీతిలో తీసుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేయడం జరిగింది. మరియు సరైన ఆహారం, వ్యాయామం, మరియు మానసిక ఒత్తిడి, నిర్వహణ ద్వారా రక్తపోటును నియంత్రించవచ్చునని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ పండ్ల పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ మీరాజ్ హెన యాసిన్,డాక్టర్ ప్రియాంక, డాక్టర్ నందన డాక్టర్ మానస, డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్ %డ% హెల్త్ సిబ్బంది అయిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కుసుమ విద్యాసాగర్, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనాకర్ రెడ్డిపాల్గొనడం జరిగింది.

# వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి నల్ల మోటర్ బహుకరణ

## ప్రతాపని వెంకటేశ్వర్లు పుట్టినరోజు సందర్భంగా

**తొలి సమయం తొర్రూరు మే 17**

తొర్రూర్ వికాస తరంగిణి శాఖ నిర్వహణలో శ్రీవారి ప్రసాదం భక్తులకు వితరణ చేయబడినది తోరూర్ వాస్తవ్యులు రేవంత్ ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ అధినేత ప్రతాపని వెంకటేశ్వర్లు జన్మదిన సందర్భంగా శ్రీవారి సేవలో దేవస్థానానికి నిరంతరంగా నల్లా నీరు రావడానికి మోటర్ సమర్పించారు వీరి సేవా నిరతికి మంచి మనస్సుకు అభినందనలు వీరికి ఆలయ పక్షాన మరొక సారి జన్మదిన శుభాకాంక్షలు ఆలయ అర్చకులు వీరి గోత్రనామాలాచే అర్చన చేసి ఆశీర్వచనం చేశారు దేవస్థాన వ్యవస్థాపకులు కుందూరు రాజేందర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి మోటార్ ను ప్రారంభించారు తదుపరి స్వామి వారి శేషవస్త్రం తో ఘనంగా సన్మానించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు డాక్టర్ మాట్లాడుతూ ఎదో ఒక సందర్భంగా స్వామి వారి సేవలో ఎదో రూపంగా శాశ్వతంగా ఉయోగ పడే టివి సమర్పించవచ్చు జన్మదినం గావచ్చు పెళ్లి రోజు కావొచ్చు జ్ఞాపకార్థం కావచ్చు మనం శ్రీవారిని చూడడం కాకుండా ఆస్వామియే మనను చూడాలి అలా జరుగలంటే



శాశ్వత కైంకర్య మ్ మన శక్తాను సారం చేయాలి నిత్యం మనం ఎన్నో ఖర్చులు చేస్తాం ఒక భాగం దైవ కార్యాలకు మన సొమ్ము పూర్వ జన్మకు డిపాజిట్ చేసుకోవాలి మనం ఎన్నో పుణ్య కార్యాలు చేసాం కాబట్టే ఇలాంటి చోటుకి వస్తున్నాం కావున ప్రతి ఒక్కరు పుణ్య కార్యాలు చేయాలి అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు వికాస తరంగిణి సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

# జాతీయ లోక్ అదాలత్ పై పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ ప్రతినిధుల తో సమీక్షా సమావేశం

**తొలిసమయం, ఇల్లందు.మే, 17.**



జూన్ 14 వ తారీఖున జరగనున్న జాతీయ లోక్అదాలత్ ను విజయవంతం చేయాలని శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలు లో పోలీస్ అధికారులతో, ఇన్సూరెన్స్ కంపెని న్యాయవాదుల తో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ అన్నారు. రాజీకాదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు మరియు ఇ -పిటి కేసుల వివరాలను ఠాణాల వారిగ అడిగి తెలుసు కున్నారు.పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సారి జరిగే జాతీయ లోక్ అదాలత్ లో అత్యధిక కేసులను పరిష్కరించడం ద్వారా జిల్లాను ఉన్నత స్థానంలో తీసుకురావడం కోసం పోలీస్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతు లోక్ అదాలత్ లో రాజీపడటం వలన కక్షిదారులకు సమయము,డబ్బు వృధా కాజాలదని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు మరియు బ్యాంకు కేసులు, తెలిఫోన్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించుకొనుట కొరకు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. సాయి శ్రీ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు, పీపీ పీవీడీ లక్ష్మి, ఏ పీపీ లు, పోలీస్ అధికారులు, సీనియర్ న్యాయవాదులు ఎస్వి రామారావు, బాగం మాధవరావు, గాదె రామచంద్ర రెడ్డి, అంబటి రమేష్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## 9డిసెంబర్ 2025 ఆదివాసీ తెగల సింహ గర్జనకు

# “సన్నాహక సభగా చలో ఇల్లందు సభ”

భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ప్రయోజనాలను అక్రమంగా, చట్టబద్ధత లేకుండా దోచుకుంటున్న ఉత్తరాది సంచార కులాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని, 2017 లో ఆదివాసీ పోరాట వీరుడు కుమ్రం భీం దాదా జోడేఘాట్ నుండి మొదలైన ఆదివాసీ తెగల ఉద్యమం 9 డిసెంబర్ 2017 న లక్షలాది మందితో హైదరాబాద్ సరూర్ నగర్ లో జరిగిన సభ ద్వారా అనాటి పాలకులు, పార్టీలు పెడచెవిన పెట్టడంతో, ఉద్యమ నాయకుడు సోయం బాపురావు దాదా ఎంపీ గా ఎన్నికైన తర్వాత 9 డిసెంబర్ 2019 లో ఢిల్లీ రాంలీలా మైదానంలో దాదాపు లక్ష మందితో జరిగిన సభ ద్వారా అనాటి ప్రధానమంత్రి గారి దృష్టికి, ఆ తదుపరి అనేకసార్లు సంబంధిత కేంద్ర మంత్రులకు పూర్తి ఆధారాలు సమర్పించినా నేటి వరకు ఆదివాసీ తెగలకు న్యాయం జరుగకపోగా, వలస వచ్చిన వారికే ప్రాముఖ్యత లభించడం, ఉద్యమ నాయకునికి టికెట్ కూడా ఇవ్వకపోవడంతో యావత్ ఆదివాసీ సమాజం నిర్ఘాంతపోయింది. అదేవిధంగా ఆదివాసీ తెగల ఉద్యోగులు ఆధార్ సొసైటీ ద్వారా సుప్రీంకోర్టులో వేసిన కేసులు విచారణ దశకు వచ్చినా, కరోనా మరియు ఇతర కారణాలతో ముందుకు రాకపోవడంతో ఆదివాసీ తెగల ప్రజలలో రోజురోజుకు పాలకులు, పార్టీలు, ఆదివాసీ రాజకీయ నాయకులపై వ్యతిరేకత పెరిగి పోతుంది. మరో పక్క సొంత జాతికి చెందిన కొంత మంది స్వార్థ నాయ కులు, వలస వచ్చిన సంచార కులాలతో గూడుపుఠానీ చేసుకుని వర్గీకరణ చేయాలని ప్రకటనలు చేయడంతో , జాతి అస్తిత్వం కోసం, రాజ్యాంగ హక్కుల సాధన కోసం చట్టబద్ధత లేని కులాలను తొలగించాలనే తుడుందెబ్బ వర్గాలను ఏకం చేసుకుంటూ, అన్ని డిపార్ట్మెంట్ ఆదివాసీ ఉద్యోగులను సమన్వయం చేసే ఏ ఈ డబ్ల్యు సి ఎ ద్వారా రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నడుస్తున్న “ఆధార్ సొసైటీ” ఛలో ( బొగ్గుట్ట) ఇల్లందు సభ ను వ్యూహాత్మకంగా నిర్వహిస్తూ, వచ్చే 9 డిసెంబర్ 2025 లోగా సుప్రీం కోర్టు లో విచారణ ఆలస్యం అయినా, రాష్ట్ర, కేంద్ర పాలకులు, పార్టీలు ఆదివాసీలను నిర్లక్ష్యం చేసినా మరో సరూర్ నగర్, రామ్ లీలా సభలను మించి భారీ బహిరంగ సభ, సాంస్కృతిక పోరాటం నిర్వహించడానికి ఇల్లందు సభను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.




# వివాహ ప్రధానం కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ నాయకులు



**తొలిసమయం, ఇల్లందు.మే, 17.**

వైరా మండలం అష్ట గుర్తి గ్రామానికి చెందిన చిత్తారు నాగేశ్వరరావు - రమాదేవి ల కూతురు అఖిల - పుల్లారావు ( నెమలి గ్రామానికి చెందిన తెల్లబోయిన రామకృష్ణ కృష్ణ కుమారిల కుమారుడు )ల కు జరుగు వివాహ ప్రధానం కార్యక్రమానికి ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ లు పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి నిండు నూరేళ్ల పాటు చక్కని దాంపత్యంతో జీవించాలని ఆశీర్వదించారు. అక్కడకు చేరిన కొంతమంది యాదవులు చేసిన చర్చలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జనాభాలో దాదాపు 20 శాతం ఉన్న మన యాదవులకు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని, కురుమ యాదవులు ప్రమాదవశాత్తు మరణిస్తే, తోటి సోదర గీత కార్మికులు చేనేత కార్మికులు, మత్స్యశాఖ కార్మికులు కు ఇచ్చినట్లుగా మన యాదవులకు కూడా ఎక్స్గ్రేషియా ఇవ్వాలని, ఇవన్నీ కూడా మనమంతా ఐక్యంగా ఉంటేనే సాధించుకుంటామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తారు కృష్ణ, చిత్తారు వీరభద్రం, చిత్తారు విశ్వనాథం, చిత్తారు చిన్న వెంకటేశం గంగదేవుల నరేష్, చిత్తారు నవీన్, శీలం పుల్లయ్య మరియు తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు

# బంగారం స్వచ్ఛత తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించిన సీనియర్ న్యాయవాది జీవీకే మనోహర్

**తొలిసమయం, కొత్తగూడెం మే 17:**



బంగారు నగలలో స్వచ్ఛత ఉందా లేదా అని తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన తనిఖీ కేంద్రాన్ని సీనియర్ న్యాయవాది, ప్రభుత్వ రంగ సంస్థల సింగరేణి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ జీవీకే మనోహర్ ప్రారంభించారు. శనివారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని పెద్దబజార్ లో చిట్టిమళ్ళ బ్రహ్మాచారి, యశోద శ్రీనివాస ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బంగారపు వస్తువులు తయారు చేయించుకున్న, రెడీమేడి వస్తువులను కొనుగోలు చేసిన, ఆ నగలలో స్వచ్ఛత ఉందా లేదా అని తెలుసుకునేందుకు వీలుగా ఒక ప్రైవేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ బంగారపు వస్తువులలో హాల్ మార్క్ ఉందా లేదా అనగా 91.6 శాతం బంగారం కొనుగోలు చేసామా! లేదా అని ఈ తనిఖీ కేంద్రంలో తెలుసుకునే అవకాశం ఉంది. సామాన్య మధ్యతరగతి, ప్రజలు ఎవరైనా పెళ్లిళ్లు పేరంటాల సందర్భంగా బంగారం కొనుగోలు చేసినట్లయితే ఆ బంగారంలో నాణ్యత ఎంత అనేది తెలుసుకునే అవకాశం ఉంటుందని సీనియర్ న్యాయవాది జీవీకే మనోహర్ పేర్కొన్నారు. ప్రజలు కొనుగోలు చేసే బంగారంలో వ్యాపారస్తులు చెప్పిన విధంగా నాణ్యత ఉందా లేదా అనేది కూడా తెలుసుకోవచ్చున్నారు.

# రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందించాలి

## పత్తి రైతుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ చెల్పూరి రాము

**జమ్మికుంట, మే17**



రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలంగాణ పత్తి రైతుల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ చెల్పూరి రాము అధికారులను కోరారు. జమ్మికుంటలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈసారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో రాష్ట్రంలోనూ వర్షాలు ముందుగానే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన సూచనలను ఆసరాగా చేసుకుని, రాష్ట్రంలో నకిలీ కంపెనీలు డబ్బు సంపాదన ధ్యేయంగా కల్తీ విత్తనాలు తయారు చేస్తూ సప్లై చేస్తున్నాయని అధికారులు వాటిని అడ్డుకట్ట వేసి రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను అందించాలని కోరారు.. కల్తీ పత్తి విత్తనాలు రైతులు రైతులు పెట్టి దిగుబడి రాక రైతులు ఆత్మహత్య చేసుకునే ప్రమాదం ఉందన్నారు.. వికారాబాద్ జిల్లా కొండగల్ మండలం అంగడి రాయచూరులో శుక్రవారం సుమారు 40 లక్షల విలువైన 20 కింటాల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు సాధనం చేసుకున్నారు గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయశాఖ, పోలీస్, టాస్క్ ఫోర్స్, అధికారులు దాడులు నిర్వహించాలని కోరారు. రైతులకు నష్టం కలిగించే నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రయ విక్రయాలు చేసే వ్యాపారుల పై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించారు..

# అభివృద్ధి అన్నది..ఓ అందమైన అబద్ధం !

గతంలో భారత్ వెలిగి పోతోతందంటూ బిజెపి నేతృత్వంలోని అటల్ ప్రధానిగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఊదర గొట్టింది. ఆ తరవాత ఎన్నికల్లో బిజెపి ఓటమి పాలయ్యింది. తరవాత పదేళ్ల పాటు యూపిఎ పాలన అంతా కుంభకోణాలమయంగా మారింది. వారూ ఓటమి చెందారు. తరవాత 2014లో మరోమారు బిజెపి అధికారం లోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావిగానే గుర్తించాలి. భారత్ వెలిగిపోలేదు..దేశం అభివృద్ధిలో ముందుకు సాగడం లేదు. సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. వచ్చే ఐదేళ్లలో భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం చూస్తే..దేశం మరో ఐదేళ్లపాటు వేచి చూడాలన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడ మే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న మాటలన్నీ డొల్లగా చూడాల్సిందే. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని నిర్మలా సీతారామన్ చెప్పారు. అలాగే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కాల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ అన్నది ప్రజల రక్తామాంసాలను పీల్చి పిప్పి చేస్తోంది. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 40 వేల కోట్ల వసూళ్లను చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలను జలగల్లా పీల్చి వసూలు చేస్తున్న డబ్బుగా చూడడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణలు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. పేదలకు ఉచిత రేషన్ ఇస్తున్నామంటేనే..ప్రజల కొనుగోలు శక్తి లేకుండా పోయిందని గుర్తించడం లేదు. దాదాపు 80 కోట్ల మంది దీని వల్ల లబ్ది పొందారని గర్వంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని వివరించడం అందంగా మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండలేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి.

సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. ఇందులో జిఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజస్ట్రేషన్‌కు ఓ పది లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే ఉండేదని,కానీ, మేం దాన్ని అమలు చేసి చూపుతున్నాం. సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద నాలుగు కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతున్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధం లోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్దాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ఆర్థిక మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ వెలిగిపోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని గుర్తించాలి.

# ప్రత్యర్థులు లక్ష్యంగా రాజకీయ వేధింపులు

## ఇడి విచారణలపై విపక్ష నేతల ఆందోళన

**న్యూఢిల్లీ :** రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. తాజాగా టిడిపి నేత వర్ల రామయ్య జగన్ విషయంలో చేసిన ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బఇజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉన్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయలేదని అంటుఎన్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినా.. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగపరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీల్లో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను ఇడి అధికారులు ఏడు గంటలకు పైగా ప్రశ్నించి, అరెస్ట్ చేయడం బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీయాదవ్‌ను లక్ష్యంగా చేసుకోవడం దర్యాప్తు సంస్థల దుర్వినియోగానికి తాజా నిదర్శనం. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడి వీరిని లక్ష్యంగా చేసుకుంది. బీహార్లో మహాకూటమి ప్రభుత్వం నుండి నితీష్ కుమార్ వైదొలిగి బిజెపి పంచన చేరిన మరుసటి రోజే ఇడి విచారణ పక్రియ ప్రారంభం కావడం గమనార్హం. సిబిఐ నమోదు చేసిన కేసు ఆధారంగా తేజస్వీ తండ్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు కూడా ఇటీవలే ఇడి నోటీసులు జారీ చేసింది. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు వ్యతిరేకంగా దశాబ్దాల తరబడి లాలూ సాగిస్తున్న పోరాటం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ప్రత్యేకహోదా కోసం నిలదీసినందుకు ఇడి తనను వేధిస్తోందంటూ గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ ఏకంగా రాజకీయాలకు గుడ్‌బై చెప్పడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించేవారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయితే, నేరం రుజువై శిక్ష పడింది మాత్రం కేవలం 10 మందికి మాత్రమే! గడిచిన 18 ఏళ్లలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పిఎంఎల్ఏ) కింద 5,422 మందిపై ఇడి కేసులు పెట్టి దర్యాప్తు చేయగా, 23మందికి మాత్రమే శిక్ష పడింది. ఇది కేవలం 0.5శాతం మాత్రమే! అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్పగించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు ఇడి దాడులను అడ్డుకోవడంతో పాటు, ఆ సంస్థ సిబ్బందిపై కేసులు నమోదు చేశాయి. తాజాగా జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఇడి అధికారులు తన ప్రతిష్టను దెబ్బతీస్తున్నారంటూ కేసు దాఖలు చేశారు. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉంది. దీనిపై ఉమ్మడిగా పోరాడాల్సి ఉందని సిపిఎం నేత సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు.

# ఆర్థిక వ్యవస్థపై కార్పోరేట్ ప్రభావం

**• కుదేలవుతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ • మాంద్యం నుంచి ఒడ్డున పడే చర్యలు శూన్యం**

**న్యూఢిల్లీ :** పాలకుల తీరు కారణంగా దేశంలో ధనిక, పేద వ్యత్యాసం బాగా పెరిగిపోయింది. ఆర్థిక మాంధ్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, కుల, మత, వర్ణ వివక్ష తీవ్ర రూపం దాల్చాయి. కేవలం కొన్ని కుటుంబాలే సంపద ఫలాలు అనుభవిస్తున్నాయి. మోడీ సర్కార్ వచ్చాక ఆయన తీసుకున్న నిర్ణయాలు కేవలం ధనికవర్గాలకే మేలు చేశాయి. మోదీ ప్రభుత్వం దేశాన్ని విపత్తులోకి నెట్టేసింది. కార్పొరేట్ శక్తుల అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. నోట్ల రద్దు మొదలుకుని జీఎస్టీ వల్ల సామాన్య ప్రజల్లో కష్టాల్లో మగ్గుతున్నారు. నల్లధనాన్ని వెలికితీస్తానన్న మోదీ.. ఆ దిశగా చర్యలేవీ చేపట్టలేదు. మహిళలు, దళితులు, మైనారిటీలపై వందల సంఖ్యలో దాడులు పెరిగిపోయాయి. నిరుద్యో గాన్ని నిర్మూలించడంలో మోదీ విఫలమయ్యారు. ఫలితంగా రెండేళ్లలో దేశంలో 3.5శాతం మేర నిరుద్యో గం పెరిగింది. భాజపా ప్రభుత్వం పూర్తిగా నియంతృత్వ ధోరణిని అవలంబిస్తోంది. ఈ ప్రభుత్వ వైఖరితో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్పడింది. రైతులు, కార్మికులు, మహిళలు, మైనారిటీలు, యువత.. ఇలా అన్ని వర్గాల్లోనూ అసంతృప్తి నెలకొంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే ఆర్థికమాంద్యం దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణానికి విరుగుడుగా ఆర్థికమాంద్యాన్ని ప్రయోగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో ఎగుమతులు పెరగడం మాట అటుంచి తగ్గే ప్రమాదం ఉంది. ఇక గృహాల, భూముల మార్కెట్ విలువలను కృత్రిమంగా పెంచడం ద్వారా మన దేశంలో అంతగా ఫలితాన్ని సాధించడం లేదు. ఒక చిన్న సామాజిక తరగతిని మరింత ధనవంతులుగా చేయడానికి మాత్రమే అది తోడ్పడుతుంది. మొత్తంగా చూస్తే మన దేశ ఆర్థిక వృద్ధి అనేది పెరుగుతుందని ఆశించడానికి ఏ కారణమూ కనిపించడం లేదు. పైగా అది తగ్గుముఖం పడుతోందని చెప్పడానికి తగిన కారణాలు ఉన్నాయి. పెట్టుబడుల వృద్ధి రేటు తగ్గుతోంది. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న నేపథ్యంలో వినిమయం తగ్గుతోంది. ఐఎంఎఫ్ కూడా ప్రైవేటు వ్యక్తుల వినిమయంగాని, పెట్టుబడులు గాని పెరగని కారణంగానే భారతదేశ ఆర్థికవృద్ధి తగ్గుముఖం పట్టనున్నట్టు చెప్తోంది. ఇంత తేడా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా దానిని అధిగమించగలిగే పరిస్థితి ఎటుతిరిగీ లేనే లేదు.ఇన్ని పరిమితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తాను ఏయే పద్దుల మీద ఖర్చు చేస్తోందో ఆ ఖర్చు కేటాయింపులను మార్చితే మన ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని ప్రేరేపించే అవకాశాలు ఉన్నాయి.సరుకుల ఉత్పత్తి ప్రధానంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో జరుగుతుంది. ఆ పరిశ్రమలకు మిగిలే లాభాలు చాలా తక్కువగా ఉంటాయి. అంతేగాక, ఆ చిన్న పరిశ్రమల యజమానులు తమ వద్దకు వచ్చిన సొమ్మును మళ్ళీ పెట్టుబడి రూపంలోనో, ఖర్చు రూపంలోనో మార్కెట్ లోకి మరోసారి పంపిస్తారు. ఆ విధంగా శ్రామిక ప్రజలకు నేరుగా అందేలా ప్రభుత్వం ఖర్చు చేస్తే అది రెండు, మూడింతలు మార్కెట్ లో వినిమయం జరగడానికి, అంటే డిమాండ్ పెరగడానికి దోహదపడుతుంది. అదే మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తే అప్పుడు ఆ ఖర్చులో ఎక్కువ భాగం దిగుమతుల కోసం గాని, ప్రాజెక్టులు చేపట్టిన కార్పొరేట్ల దగ్గర మిగులు రూపంలో గాని ఉండిపోతుంది. మార్కెట్ లోకి ఎక్కువ భాగం రావడం అనేది ఉండదు. అందువలన మార్కెట్ లో డిమాండ్ పెరగడానికి అంతగా దోహదపడదు. ఈ క్రమంలో దేశీయ ఆర్థిక విధానం అవసరం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన చర్యలకు ఉపక్రమించాలి.

# రాజీకాయాల్లో రాణించిన నటులు అరుదు !




సినీపరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి..అధికారం చేపట్టి, ప్రజల్లో ప్రభావం చూపిన వారు చాలా తక్కువ మందే ఉన్నారు. తమిళనాట ఎంజి రామచంద్రన్ ఇలా ప్రజల మనిషిగా నిలబడ్డారు. తరవాత జయలలిత కూడా అదేకోవలో ప్రజల్లో చిరస్థాయిగా నిలిచారు. చిత్రపరిశ్రమ నుంచే వచ్చిన కరుణానిధి కూడా తమిళ నాట ప్రభావం చూపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీ రామారావు కూడా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. తనకంటూ ఓ స్థానం ఏర్పరచుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిరంజీవి కూడా ప్రజాప్రస్థానం పెట్టి తరవాత దానిని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. ఇప్పుడాయన తమ్ముడు పవన్ కళ్యాణ్ కూడా జనసేనతో ఎపిలో దూసుకుపోతున్నారు. అయితే ప్రజల్లో విపరీతమైన ప్రభావం చూపగలిగిన వారు చాలా తక్కువమందే ఉన్నారు. ప్రముఖ తమిళ నటుడు విజయ్ రాజకీయాల్లో ప్రవేశిస్తున్నట్లు శుక్రవారం ప్రకటించడంతో మరోసారి రాజకీయ సినిమా రంగం సంబంధాల అంశం తెరపైకి వచ్చింది. రాజకీయ పార్టీ స్థాపించిన మొదటి నటుడు విజయ్ కాదని, అలాగే ఆయనే చివరి వాడు కాదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావును రాజకీయాల్లో అత్యంత రాణించిన నటుడుగా చెప్పుకోవాలి. ఎన్‌టి రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు. తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడంతోపాటు వినూత్న సంస్కరణలను తీసుకొచ్చి చరిత్రలో చెరగని ముద్ర వేశారు. సినీ ప్రముఖులు రాజకీయాల్లోకి రావడ మనేది కొత్తేమీ కాదు. ఎందుకంటే సినిమాలకు, రాజకీయాలకు మధ్య అవినాభావ సంబంధం ఉంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అనేక మంది నటులు రాజకీయరంగ ప్రవేశం చేసి, ప్రజాసేవ చేశారు. ముఖ్యంగా దక్షిణాదిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. వెండితెరను ఏలిన చాలామంది కథానాయకులు, తర్వాతి కాలంలో రాజకీయాల్లో నాయకు లుగా ఓ వెలుగు వెలిగారు. వారిలో కొందరు సొంతంగా రాజకీయ పార్టీని స్థాపించి ప్రజల్లోకి వెళ్తే, మరి కొందరు ఇతర పార్టీలలో చేరి రాణించారు. మన దేశంలో అత్యధికంగా తమిళనాడు రాజకీయాల్లోనే సినీ తారల పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఇప్పుడు తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కొత్త పార్టీ ప్రకటించ డంతో మరోసారి ఈ అంశం చర్చకు వచ్చింది. అన్నాదొరై, ఏంజీఆర్, జయలలిత, కరుణానిధి, నుంచి కమల్ హాసన్, విజయ్ వరకూ.. రాజకీయాల్లోకి వచ్చిన తమిళ నటులు కొందరే తమ ప్రభావం చూపారు. కంజీవరం నటరాజన్ అన్నాదురై.. స్వతంత్ర భారత దేశంలో కొన్ని తమిళ సినిమాల్లో హీరోగా నటించ డంతో పాటు స్టోరీ, స్క్రీన్ ప్లే రైటర్‌గా కూడా వర్క్ చేశారు. పెరియార్ ఇ.వి.రామస్వామికి అనుయాయిగా పేరున్న ఆయన, ద్రవిడ కళగం పార్టీలో ఉన్నత స్థానానికి ఎదిగారు. ప్రత్యేక ద్రవిడ రాష్ట్ర ఉద్యమానికి, రాజకీయాలకు సినిమాలని వాడుకున్నారు. అయితే పెరియార్‌తో తలెత్తిన అభిప్రాయభేదాల కారణంగా బయటకి వచ్చి, 1949లో 'ద్రవిడ మున్నేట్ర కళగం' (డిఎంకె) పార్టీని స్థాపించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్రానికి మొట్ట మొదటి ముఖ్యమంత్రిగా అన్నాదొరై చరిత్రకెక్కారు. నడిగర్ తిలకం' శివాజీ గణేశన్ గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. డీఎంకే పార్టీలో చేరిన శివాజీ.. అప్పట్లో తిరుపతి ఆలయాన్ని సందర్శించడంపై విమర్శలు రావడంతో బయటకు వచ్చి, తమిళ నేషనల్ పార్టీలో చేరారు. ఇందిరాగాంధీ హయాంలో ఆయన రాజ్యసభ సభ్యునిగా చేశారు. 1988-1989 కాలంలో సొంతంగా తమిళగ మున్నేట్ర మున్నాని అనే రాజకీయ పార్టీని స్థాపించారు. తమిళ సినీ రాజకీయాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తి మరుదూర్ గోపాలన్ రామచంద్రన్. 1953 వరకు కాంగ్రెస్‌లో ఉన్న ఎంజీఆర్, అన్నాదొరై స్ఫూర్తితో డీఎంకేలో చేరారు. అయితే కరుణానిధి డీఎంకే నాయకత్వ బాధ్యతలు చేపట్టి సీఎం అయిన తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఎంజీఆర్‌ను బహిష్కరించారు. ఆ తర్వాత అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం ఎఐడిఎంకె పార్టీని స్థాపించారు. 1977 - 1987 మధ్య కాలంలో రెండుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా చేసి, మరణించే వరకు ఆ పదవిలో ఉన్నారు. మరణానంతరం ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న లభించింది. ఎంజీఆర్ సతీమణి జానకి రామచంద్రన్ కొన్ని అనివార్య పరిస్థితుల్లో ఎంజిఆర్ మరణం తరవాత సిఎం అయ్యారు. తరవాత ఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిగా పురట్చి తలైవి జయలలిత తమిళ రాజకీయాల్లో పెను సంచలనమనే చెప్పాలి. అన్నాడీఎంకే కు ఏకైక నాయకురాలిగా ఎదిగారు. 1991 - 2016 మధ్య కాలంలో జయలలిత ఆరుసార్లు తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేశారు. కొన్నేళ్ల పాటు సినీ అభిమానులను అలరించిన కెప్టెన్ విజయ్ కాంత్, 2005లో దేశీయ ముర్పోక్కు ద్రవిడ కజగం అనే పార్టీని స్థాపించారు. 2011 నుంచి 2016 వరకు ప్రతిపక్ష నేతగా కూడా పనిచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తమిళ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు కానీ, తన పార్టీని అధికారం లోకి తీసుకురాలేకపోయారు. విజయకాంత్ గత డిసెంబర్‌లో కన్నుమూశారు. సీనియర్ నటుడు శరత్ కుమార్ సైతం రాజకీయాల్లో ప్రవేశించారు. 2007లో తమిళనాడులో ఆల్ ఇండియా సమతువ మక్కల్ కట్చి అనే సొంత పార్టీని స్థాపించాడు. రాజకీయవేత్త కె. కామరాజ్ విలువలను పాటిస్తామని ప్రకటించుకున్నాడు. ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. గత కొన్ని దశాబ్దాలుగా సినీ అభిమానులను అలరిస్తున్న విశ్వ నటుడు కమల్ హాసన్.. రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. సీనియర్ నటి ఖుష్బు గత 14 ఏళ్లుగా తమిళనాడు రాజకీయాల్లో ఉన్నారు. 2010లో డీఎంకేలో పార్టీలో చేరి, నాలుగేళ్లలోనే కాంగ్రెస్‌లోకి వచ్చి చేరారు. ఆ తర్వాత 2020లో బీజేపీలో చేరి, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. మరో సీనియర్ నటి గౌతమి సైతం పాలిటిక్స్ లోకి వచ్చారు. 1997 నుంచి భారతీయ జనతా పార్టీలో కొనసాగుతున్నారు. దివంగత కరుణానిధి మనవడు, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ కూడా రాజకీయాల్లో ఉన్నారు. గత ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేసి డీఎంకే పార్టీ భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఎంఎల్ఏగా గెలిచి తమిళనాడు శాసనసనలో అడుగుపెట్టారు. కోలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన దళపతి విజయ్ కూడా ఇప్పుడు పాలిటిక్స్ లో ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఏళ్లుగా ప్రచారంలో ఉన్న వార్తలను నిజం చేస్తూ, ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో సొంత రాజకీయ పార్టీని ప్రకటించారు. ఇకపోతే రాధా రవి, సీమాన్, టి. రాజేందర్, తంబి రామస్వామి, కరుణాస్, ఎంఆర్ కృష్ణన్ వంటి పలువురు సినీ ప్రముఖులు కూడా రాజకీయాలలో ఉన్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా పాలిటిక్స్ లోకి రావాలని భావించారు. అయితే తన ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చివరి నిమిషంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు.

# మామిడి రైతులు సలహాలు తీసుకోవాలి

**సంగారెడ్డి :** మామిడి సాగు చేసిన, సాగుచేసే రైతులు ఉద్యానశాఖ అధికారులు ఇచ్చే సూచనలుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మంచుతో పూత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తుగా సంరక్షణ చర్యలు చేపడితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. రబీ పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించడంలో జిల్లా అన్నదాతలు పెద్దగా స్పందించడం లేదు. ఇప్పటి వరకు ముందుకు వచ్చిన రైతుల సంఖ్య తక్కువగా ఉంది. గతంతో పోలిస్తే రుణాలు తీసుకోని రైతులు ఆసక్తి కనపర చలేదు. దేశ వ్యాప్తంగా కూడా రబీ పంటలు సాగు చేసి రుణాలు తీసుకోని రైతులు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రాని వారి సంఖ్య ఎక్కువగా ఉంది. రబీ కాలంలో జిల్లా వ్యాప్తంగా బోరు బావులు, బావులు, కాలువల కింద ప్రధానంగా వేరుసెనగ, వరి, మినుము, నువ్వులు, పొద్దు తిరుగుడు, పసుపు, వర్షాధారం కింద జొన్న, తదితర పంటలతో పాటు ప్రధానంగా పేరుకు రబీ అయినా వర్షాధారం కింద అన్ని పంటల కంటే ఎక్కువగా శనగ సాగు చేశారు.



# జనం కోసం పనిచేసే వారికే జనబలం !

జనగళం మేమే..జనబలం మేమే. గులాబీదళం..పార్లమెంటులో ఉండాల్సిందే.. ఓటమి తరవాత ఇప్పుడు గులాబీ దళానికి ప్రజలు గుర్తుకు వస్తున్నారు. ప్రజలకు మేమే అండ అని చాటుకోవాలని తపన పడుతు న్నారు. అయినా అహంకారం వీడినట్లుగా కానరావడం లేదు. తమ తప్పుల వల్లనే ఓటమి చెందా మని యువరాజావారు భావించడం లేదు. చేసిన తప్పులపై సమీక్ష చేసుకుని ఉంటే బాగుండేది. కానీ కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై అప్పుడే నిందలు వేసే పనిలోపడ్డారు. నిలదీసే చర్యలకు పూనుకుంటున్నారు. మేడిగడ్డ అక్రమాలపై చీమకుట్టినట్లు లేదు. విద్యుత్ అప్పులపైనా నిజాలు చెప్పడం లేదు. అప్పుల చిట్టా విప్పితే ఆస్తులు సంపాదించి పెట్టామని గొప్పలు చెబుతున్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకనానా తిప్పలు పెట్టారు. 20 ఏళ్లనాటి జర్నలిస్టుల భూ సమస్యను పరిష్కరించలేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా ఖాతరు చేయలేదు. రైతుబంధు లాంటి పథకాలతో వేలకోట్లు దుర్వినియోగం చేశారు. దళితబంధులోనూ అదే జరిగింది. వీటిపై విచారణ జరపాలన్న డిమాండ్‌ను సిఎం రేవంత్ రెడ్డి పట్టించుకుంటారా లేదా అన్నది చూడాలి. ఇకపోతే కాలేశ్వరంపై సిబిఐ విచారణ చేయించాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి నేతల తీరు కెసిఆర్‌ను రక్షించే ఎత్తుగడ తప్ప మరోటి కాదు. సిబిఐకి అప్పగిస్తే.. ఏం జరుగుతుందో తెలియంది కాదు. అందువల్ల పదేళ్ల పాపాలపై రాష్ట్రంలోనే విచారణ జరగాలి. ఇన్ని పాపాలు చేసి..ఓడిపోయాక కూడా ఆత్మపరిశీలన చేసుకోకుండా అహంకారం ప్రదర్శించే నేతలు అవసరమా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. అలాగే ఇలాంటి వారు మన నాయకులని చెప్పుకోవడానికి సిగ్గుపడాలి. సమీక్షల పేరుతో ఇప్పుడు పార్లమెంటులో అడుగు పెట్టడం ఎలా అని ఆలోచన చేస్తున్నారు. ఆధునిక రాజకీయాల్లో రాటుదేలడమన్నది అంత సులువు కాదు..ప్రజల ఆదరణ పొందడం అన్నదీ మరీ అంత సులవూ కాదు...ప్రజల నాడి తెలుసుకోవాలి. ప్రజల్లో ఆదరణ పొందాలి. ఓట్ల కోసం కాదు..జనం కోసం ఆరాటపడే తపన అన్నది ఎంతమందిలో ఉంటుంది. ప్రజలంతా పార్టీలకు అతీతంగా తమ నాయకు డు ఫలానా అని చెప్పగలిగిన వారు ఎంతమంది ఉంటారు..? అలా ప్రజల గుండెల్లో గూడుకుట్టు కుంటే అంతకుమించిన అదృష్టం ఉంటుందా..? అలా ఎంతమంది చేస్తారు..ఎంతమంది జనం నాడి పడతారు... ఎంతమంది జనం గుండెచప్పుడు అవుతారు...అలా జనం గెండెచప్పుడుగా మారుతారు. ఇవీన్ని ఉన్నాయని నమ్మి తెలంగాణ ఉద్యమంలో ప్రజలంతా కెసిఆర్‌ను తమ నాయకుడిగా గుర్తించి తలపైకి ఎత్తుకున్నారు. తెలంగాణ యావత్ సమాజం కూడా కెసిఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కూడా రెండుసార్లు అధికారం కట్టబెట్టారు. కానీ జరిగిందేమిటి..?ప్రజలతో నాకు పనిలేదన్నారు. సిఎంను కలవాల్సిన అవసరం ప్రజలకు ఏమిటని ప్రశ్నించారు. నేనే తెలంగాణ తెచ్చానని తలపొగరు ప్రదర్శించారు. నిస్వార్థ రాజకీయాలను ఔపోసన పట్టే వారు ఎంతమంది...? ప్రజలతో ఓట్లు వేయించుకుని..వారిని దూరం పెట్టి..ఎన్నికల ముందు వంగివంగి సలామ్ కొట్టే ఈ రోజుల్లో అరుదైన నేతలూ ఉన్నారు. అలాంటి వారిలో ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ ముందుంటారు. జనం గుండె చప్పుడుగా మారుతున్నారు. వారి కాలుకు ముల్లు గుచ్చుకుంటే తీయలేకపోవచ్చు..కానీ వారికి నేనున్నాననే ధైర్యం..భరోసా ఇవ్వగలిగే నాయకుల్లో తప్పుకుండా ఉండేవారు అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో చప్పున చెప్పుకునే నేత నవీన్ పట్నాయక్. అంతెందుకు మనదగ్గర ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కూడా అలాంటి వారి కోవలోకే వస్తారు. కానీ ధరణిలో ఆయన భూమి కూడా ఆగమయ్యిందని తెలిసాక...కెసిఆర్ హయాంలో జరిగిన అకృత్యాలు తలచుకుంటేనే బాధేస్తోంది. ప్రజల సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు.



ఎడిటర్
వి. అయోధ్య రామయ్య

వాస్తవమే గమ్యం!గమనం!!
ఎడిటరియల్

"తెలంగాణా సమకాలీన సామాజిక రాజకీయ ఆర్థిక పరిస్థితులు, వాటితో పాటు గత పదిపళ్ళ బిఆర్ఎస్ ప్రత్యేక రాష్ట్ర పాలన మరియు వైఫల్యాలు, అధికారం ముసుగులో వ్యవస్థీకృత నేరాలే కాకుండా మితి మీరిన ప్రభుత్వ ఉమ్మడి ఆస్తుల దోపిడీలో స్వయానా మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ దోషిగా నిలబడ్డాడు, కనుక కనుక అతని ఆర్థికదోపిడీ, ముక్యంగా కాలేశ్వరం ప్రాజెక్టు లో లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ, వాటి పై రిపోర్టులు కమిషన్స్ వేసి కూర్చుంటే సరిపోదు, బట్ట బయలు చేసి దోషికి శిక్ష పడేలా కాంగ్రెస్ పార్టీ కనుక చేయకుంటే ప్రజల్లో గత బిఆర్ ఎస్ కు పట్టిన గతి మళ్ళీ కాంగ్రెస్ కు పడుతుంది అని కాంగ్రెస్ మాజీ ఎంపీ, ఏఐసీసీ ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కి గౌడ్ కుండ బద్దలు కొట్టారు.ఆయన మాటలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను మరింత వేడెక్కించాయి, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి మరియు ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి కి మరింత బాధ్యతను గుర్తుచేసాయి, సమైక్యాంధ్రలో ముఖ్యమంత్రిని కావడం అసాధ్యం అని తెలిసిన కెసిఆర్, తెలంగాణా ఉద్యమంలో జొర్రి సీఎం అయ్యాక మొత్తం తెలంగాణ సంపదను వ్యూహాత్మకంగా దోచుకున్నారు, కనుక అమరవీరుల ఆకాంక్షలకు నీళ్లు వదిలారు, నిరుద్యోగం, ఆకలి, దారిద్రం అలాగే ఉండడానికి కారణం అయ్యారు, విద్యా వైద్యం అందక జనం అల్లాడుతు న్నారు. దోచిన డబ్బులు ప్రజలకు పెడితే తెలంగాణ సస్య శ్యామలం అయ్యేది.అని సభలో మాట్లాడారు"

# మా కాంగ్రెస్‌కు

# అదే గతి పడుతుంది..

- ఇంజనీర్ ను శిక్షించి చేతులు దులువు కుంటే సరిపోదు ఆదేశాల మాటున దోపిడీ కొనసాగించిన కెసిఆర్ ను శిక్షించాలి
- కాళేశ్వరం, గత పాలకుల అవినీతి ని కాంగ్రెస్ పార్టీ బయట పెట్టకుంటే కెసిఆర్ జాతిపిత అనే బ్రాండ్ ఇమేజ్ ను ప్రజలు నమ్ముతారు
- రిపోర్టులు కమిషన్స్ వేసి కూర్చుంటే, దోషులను శిక్షించకుంటే గత బిఆర్ ఎస్ కు పట్టిన గతే మా కాంగ్రెస్ కు పడుతుంది.
- మాజీ ఎంపీ, ఏఐసీసీ ప్రచార కమిటీ అధ్యక్షులు మధుయాష్కి గౌడ్


ఈ నెల 15వ తారీకున సోమోజీగూడ ప్రెస్ క్లబ్ లో జల సాధన సమితి ఆధ్వర్యంలో "కాళేశ్వరం ఎత్తిపోతల పథకం భవిష్యత్తు"పై ప్రముఖుల విద్యావంతుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఈ సభలో పాల్గొన్నావారి మెజారిటీ అభిప్రాయాలు, బ్యారేజీ లను పునరుద్దరణ చెయ్యడం అసాధ్యం అని తేల్చి చెప్పిన డ్యాం సేఫ్టీ అతారిటీని నొక్కి చెప్పాయి, అధికారం లోకి రావడానికి గత టిఆర్ఎస్ అవినీతి పాలన వివిధ అంశాలతో పాటు కాళేశ్వరం కు ప్రత్యామ్నాయంగా తుమ్మిడి హెట్టి నిర్మాణం చేపడతాం అని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16నెలలు కావొస్తుంది, తుమ్మిడి హెట్టి లో ఒక తట్ట మట్టి పోయలేదు మహారాష్ట్ర తొ మాట్లాడలేదు, కనుక కాలేశ్వరం కొలాబ్స్ కావడానికి కేసీఆర్ ఎంతైతే కారణమో! తుమ్మిడి హెట్టి ఇంతవరకు పునరుద్దరణ చేయక పోవడం ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించ కపోవ డంలో సీఎం రేవంత్ రెడ్డికూడా అంతే కారణం కాబోతున్నారు అని గుర్తుకు చేసారు

అధికార పార్టీ నాయకులు, బాధ్యతాయుత స్థానంలో ఉండికూడా మాట్లాడిన మధుయాష్కి గౌడ్ మాటలు చారిత్రక సత్యాలు, నిత్యాల ను ఆవిష్కృతం చేస్తున్నాయి

ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రభుత్వ ఆస్తులను కాపాడే కస్టోడియన్స్ మాత్రమే అన్నారు, ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తులుగా ఖర్చు పెట్టరాదు అని గుర్తు చేశారు, ఒకవేళ అద్దులు దాటి ఖర్చు పెడితే సమాజంలోని అందరు బాధితులుగా ఉంటారు అన్నారు కొన్ని దేశాల్లో పాలకులు ప్రజల ఆస్తులను దుర్వినియోగం చేస్తే శిక్షలు వేశారన్నారు, కొన్ని సందర్భాల్లో ఉరి శిక్షలు అమలు చేశారని గుర్తు చేసారు,

లక్షకోట్లు దుర్వినియోగం చేసి కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన ఇంజనీర్ ఇంట్లోనే 300 కోట్లు దొరికాయి, అంటే కెసిఆర్ ఇంట్లో ఎన్ని వేల కోట్లు ఉంటాయో అర్థం అవుతోంది అన్నారు. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ నివేదికలు వచ్చాయి. దోషులు ఎవరనేది తేల్చి చెప్పాయి,అటు వైపు చర్యలు తీసుకో కుండా కాంగ్రెస్ పార్టీ తాత్సరం చెయ్యొద్దు అంటూ సభ లోని వక్తలు అభిప్రాయాలు వ్యక్తం చేసారు

వి ప్రకాష్ అనే (టోడు) ఆయన దొంగే దొంగ అని అరిచినట్లు కాళేశ్వరం పై కాంగ్రెస్ కుట్రలు అనే నివేదికను తయారు చేశారు. ఇలాంటి మిద్యా మేధావులకు బాగా మేత దొరికింది,కెసిఆర్ పై కృతజ్ఞతతో హద్దు మీరు అబద్దాల కథలు అల్లు తున్నారు కనుక కాంగ్రెస్ పార్టీ ఆయన వ్యవహారం పై సీరియస్ గా మసులుకోవాలి హెచ్చరికగా అన్నారు కాలేశ్వరం ప్రాజెక్టు లో దోచుకున్న, దాచుకున్న అవినీతి ఆస్తిని కాంగ్రెస్ పార్టీ బయట పెట్టాలి లేకుంటే ప్రజల్లో తెలంగాణ కెసిఆర్ పిత అనే బ్రాండ్ ను ఇంకా ప్రజలు గుడ్డిగా నమ్మే ప్రమాదం ఉంటుంది అన్నారు. రాష్ట్రాన్ని కెసిఆర్ దోపిడీ చేసిన అంశాలను, మరియు కాళేశ్వరం దోపిడీని ప్రచారసాధనంగా ఉపయోగించుకుని గెలిచిన కాంగ్రెస్ అవి బయటకు తీయకుంటే కాంగ్రెస్ కు గత బిఆర్ ఎస్ కు పట్టిన గతే తథ్యం అన్నారు






TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101